జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 19-10-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 142 పేజీలు: 8 వెల : రూ.7

# పోలీసుల కన్నుగప్పి.. పరార్




* చోరీకి పాల్పడుతున్న మహిళను పట్టుకున్న ప్రైవేట్ హాస్టల్ సిబ్బంది
* శ్రీకాకుళం రూరల్ పోలీసులకు అప్పగింత
* పోలీసుల నిర్లక్ష్యంతో స్టేషన్ నుంచి పారిపోయిన యువతి
* ఉలిక్కిపడిన పోలీసు సిబ్బంది
* ఆమె కోసం చుట్టుపక్కల వెదుకులాట
* కొందరు పోలీసుల తీరుపై ఉన్నతాధికారుల ఆగ్రహం

**శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 18 (వార్త):** పోలీసుల కన్నుగప్పి ఓ నిందితురాలు పరారైన ఘటన శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ఘటన కొందరు పోలీసుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. వివరాల్లోకి వెళితే.. రాగోలులోని జెమ్స్ ఆసుపత్రి ఆవరణలో పలు ప్రైవేట్ హాస్టల్స్ ఉన్నాయి. వాటిలో జెమ్స్‌లో చదివే, పనిచేసే ఎంబీబీఎస్, పీజీ, నర్సింగ్ కోర్సులు చదివేవారు నివాసముంటున్నారు. అయితే ఓ మహిళ కొద్ది నెలలుగా ఈ హాస్టల్స్‌లోకి ఎవరికీ అనుమానం రాకుండా చొరబడి చేతికందిన సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులు, నగదును దొంగిలించుకుపోయేది. ఈ విషయమై కొందరు హాస్టల్ నిర్వాహకులకు సైతం ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆ మహిళ శుక్రవారం ఓ హాస్టల్‌లో చోరీ చేస్తుండగా కొందరు పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి ఆమెను శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఆమెను విచారణ నిమిత్తం పోలీసులు స్టేషన్‌లోనే ఉంచారు. కొందరు పోలీసులు ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉన్న సమయం చూసి ఆ మహిళ బాత్‌రూంకు వెళతానని వారిని నమ్మబలికి పోలీస్‌స్టేషన్ వెనుక నుంచి మెల్లగా జారుకుంది. ఆమె ఎంతకూ రాకపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు స్టేషన్ అంతా గాలించారు. ఆమె కనబడకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలను గాలించారు. ఈ విషయాన్ని పోలీసులు ఆ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఓ మహిళ పరార్ కావడంతో ఉన్నతాధికారులు స్టేషన్‌లో ఉన్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల నిర్లక్ష్యం, అలసత్వం పట్ల మండిపడ్డారు. పరారీలో ఉన్న ఆమెను ఎలాగైనా పట్టుకోవాలని ఉన్నతాధికారులు హుకుం జారీ చేయడంతో పోలీసులు వెదుకులాటలో పడ్డారు.



# సమస్యలు ఉంటే.. నేరుగా.. సంప్రదించండి

* పరిష్కారానికి చర్యలు చేపడతా * మీ సంక్షేమమే నా ధ్యేయం
* ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి * ఎచ్చెర్లలో పోలీసు గ్రీవెన్స్ డే

**శ్రీకాకుళం క్రైం, అక్టోబర్18 (వార్త):** పోలీసు సిబ్బంది వ్యక్తిగత, ఆరోగ్య, ఉద్యోగరీత్యా ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించాలని, ఆయా సమస్యలపై సాధ్యాసాధ్యాలు బట్టి పరిష్కరిస్తానని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఎచ్చెర్ల స్థానిక ఆర్మ్ రిజర్వ్ పోలీసు మైదానంలో పోలీస్ కమ్యూనిటీ హాల్లో జిల్లా ఆర్మ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందికి ప్రత్యేకంగా పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. పలువురు ఆర్మ్ రిజర్వ్ పోలీసులు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి వినతుల రూపంలో తీసుకువెళ్లారు. అనంతరం ఎస్పీ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ సిబ్బందికి ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అత్యవసరమైనప్పుడు ఫోన్ కాల్ ద్వారా కూడా సమస్యలను వివరించుకోవచ్చన్నారు. మీ సంక్షేమమే నా ధ్యేయమని భరోసా ఇచ్చారు. సిబ్బంది ప్రతి ఒక్కరు క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని మానసిక, శారీరకంగా దృఢంగా ఉండి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగ రావు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మీకోసంలో 11 వినతులు



కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి 11 వినతులను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. సివిల్ అంశాలపై 1, కుటుంబ కలహాలపై 1, పాత ఫిర్యాదులపై 1, పరిపాలన అంశాలపై 2, ఇతరత్రా అంశాలపై 6 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న అధికారులు తక్షణం వీటిని పరిశీలించి చట్టపరిధిలో బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఎస్పీని కలిసిన పోలీసు అధికారులు



శ్రీకాకుళం, అక్టోబరు 18 (వార్త): ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ సి.ఐ.గా ఎం.కృష్ణమూర్తి, టాస్క్ ఫోర్స్ సి.ఐ.గా ఎన్.కృష్ణారావు, జిల్లా ట్రాఫిక్ రికార్డు బ్యూరో (డిటిర్బీ) ఎస్.ఐ.గా ఎ.కోటీశ్వరరావులు శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

## కూటమి పాలనతోనే

# గ్రామ స్వరాజ్యం

### నియోజక వర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు మజ్జి గణపతి

వంగర, అక్టోబర్ 18 (వార్త): కూటమి ప్రభుత్వం పాలనతోనే అభివృద్ధి జరుగుతుందని రాజాం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు మజ్జి గణపతి అన్నారు. శుక్రవారం ఆయన మెట్ట మగ్గూరు తదితర గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ పల్లెపండుగ వారోత్సవాల ప్రధాన ధ్యేయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తట్ట మట్టి పోసిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించారన్నారు. అందులో భాగంగా ప్రతి గ్రామంలో పల్లె పండగ సందర్భంగా సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల ఏర్పాటుకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కేటాయించారన్నారు. పేదల కోసం అన్నా క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి 5 రూపాయ భోజనం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి టీడీపీ కూటమితోనే సాధ్యమని ప్రస్తుతం చేసి చూపిస్తుందన్నారు. వైకాపా దోచుకో, పంచుకో, తినుకో భరించలేకనే ప్రజలు జగన్‌ను తరిమేశారన్నారు. రాష్ట్రంలో జే-బ్రాండ్‌లు, జే-టాక్స్‌లు పోయి 4 నెలలు దాటిందని జగన్ గుర్తించాలన్నారు. రాజీనామాలు, రెన్యూవల్ చేయకుండా వాలంటీర్ల గొంతుకోసింది కాకుండా డ్రామాలాడుతున్నారు. వైకాపా అయిదేళ్ల మద్యం కుంభకోణంలో త్వరలో జగన్ జైలుకు పోవడం ఖాయమన్నారు. లైసెన్సులు ఇచ్చిందెవరో, లక్షకోట్లు బొక్కిందెవరో జైల్లో తీరిగ్గా లెక్కలు వేసుకోవచ్చున్నారు. 4 నెలల్లో 100కు పైగా పథకాలు అమలు చేసిన కూటమి ప్రభుత్వంపై నిందలు జగన్ పిచ్చికి పరాకాష్టన్నారు. ప్రజల అత్యంత సంతృప్త స్థాయిలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగుతోందన్నారు. ఈ రోజు ప్రజాప్రతినిధుల విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా అదే చెప్పారన్నారు. రాష్ట్రాన్ని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసి చంద్రబాబు చూపిస్తారని తెలిపారు.



## వంగర సిఎస్ డిటిగా రామారావు



వంగర, అక్టోబర్ 17 (వార్త): వంగర, రేగిడి మండలాల సిఎస్‌డీటీగా పిన్నింటి రామారావు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో చీపురుపల్లి సిఎస్‌డీటీగా పనిచేసి ఇటీవలన జరిగిన బదిలీల్లో భాగంగా ఈ మండలాలకు నిమించ బడ్డారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి సిఎస్‌డీటీగా తమ విధుల్లో చక్కగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. అలాగే ఆయా మండలాల నాయకులు, అధికారులు, డీలర్స్ పూర్తి సహాయ సహకారాన్ని అందించాలని కోరారు.

## నేడు మందసలో యూనియన్ బ్యాంక్ ప్రారంభం

మందస, అక్టోబరు 18 (వార్త): మందస పట్టణంతోని కరణంవీధిలో ఈ నెల 19 యూనియన్ బ్యాంక్ నూతన బ్రాంచ్ను ప్రారంభిస్తున్నట్టు బ్రాంచ్ మేనేజర్ ఎస్.విద్యాధరరావు, ఏబీఎం శ్రీనివాస్‌లు చెప్పారు. ఉదయం 9.30గంటలకు రీజనల్ హెడ్ ఎం.వెంకటతిలక్ ఈ బ్రాంచ్‌ను ప్రారంభిస్తారన్నారు. వినియోగ దారులకు మెరుగైన సేవలు అందించడమే బ్యాంక్ లక్ష్యమని, యూనియన్ బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## ఎస్పీని కలిసిన శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ రాము



శ్రీకాకుళం, అక్టోబరు 18 (వార్త): శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కె.రాము శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా (ఏఎస్ఆర్) నుంచి శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్‌కు బదిలీపై బాధ్యతలు చేపట్టారు.

## నాగుపాముతో పిల్లుల సమరం

పలాస, అక్టోబర్ 18 (వార్త): పలాస మున్సిపాలిటీలోని బృందావన చంద్ర ఆలయంలో అరుదైన దృశ్యం కనిపించింది. ఓ నాగుపామును రెండు పిల్లులు కదల నీయకుండా చేసాయి. పాము బుసకొడుతుంటే అక్కడకు రెండు పిల్లులు చేరాయి. అంతే ఆ పామును కదల కుండా ఆపేసాయి. ఇదంతా పది నిమిషాలపాటు పాము పిల్లులు మధ్య వార్ జరిగేలా ఉందని అక్కడకూ చేరిన ప్రజలు అనుమాన పడ్డారు. పాము కొంతదూరం వెళ్లగా పిల్లులు వెంటాడాయి. ఇంతలో ఓ పుట్టలోకి పాము దూరింది, పిల్లులు జారుకున్నాయి.



# మద్యం ప్రియులకు ఝులక్....?

### ఎన్నికల్లో రూ.99కే క్వాటర్... ఆచరణలో అంతా మాయ...?

పలాస, అక్టోబర్ 18 (వార్త): ఇంత అన్నారు.. అంతన్నారు తాము వస్తే ముందుగా మద్యం ప్రియులకు ఇచ్చిన హామీ అమలు చేస్తానన్నారు. కూటమి సర్కార్ ఇచ్చిన మద్యం సేవికులకు మీరు ఇచ్చిన హామీ అమలు చేయక పోగా పాత బ్రాండ్లు నే పాత ధరలు కు అమ్మూతు ఆడిన మాటలు అమలు చేయలేక పోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లైసెన్స్ పొందిన మద్యం యజమానులు నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సర్కార్ అమ్మాల్సినన ధరకు కంటే అధిక ధరలకు అమ్ముతున్నారన్నా ఆరోపణలు బాహాటంగా వినిపిస్తున్నాయి. ఇచ్చిన హామీ మేరకు రూ.99 ల క్వార్టర్ బాటిల్ పలాసలోకి రాలేదు. సామాన్య మధ్య తరగతి వర్గాలు వారు ఎంతో ఆశ తో ఆయా మద్యం దుకాణాలు వద్దకు వెల్లి ఏది వంద బాటిల్ అని అడిగితే రూ.130 బాటిల్ ఇస్తున్నారని, అది లేకపోతే రూ.150 ధర గల మద్యం ఉందని చెప్పడంతో చేసేది లేక అదే మద్యం అమ్మకాలు చేయడంపై మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి సర్కార్ మద్యం ప్రియులకు మేలు చేసేందుకు చర్యలు తీసువాలని మద్యం ప్రియులు కోరుతున్నారు..



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# యువకుడు లక్ష్మణరావు రక్తదానం




మందస, అక్టోబరు 18(వార్త): మందస మండలంలోని అంబుగాం పంచాయతీ పెద్దలింబుగాం గ్రామానికి చెందిన బదకల అప్పలమ్మ అనే మహిళలకు శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు చెప్పారు. ఆమెకు రక్తం అవసరమైంది. దీంతో అంబుగాం గ్రామానికి చెందిన యువకుడు పొందూరు లక్ష్మణరావు అప్పలమ్మకు రక్తదానం చేసి, ఆదుకున్నారు. శ్రీ పవనపుత్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదానం కొనసాగుతోంది. ఇదో మహాయజ్ఞమని, రక్తదానానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని శ్రీపవనపుత్ర సేవా సంస్థ ప్రతినిధులు కోరారు.

## మశాఖపురంలో పొలంబడి



ఇచ్ఛాపురం, అక్టోబర్ 18, (వార్త): మశాఖపురం గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మంచి వ్యవసాయ అభ్యసన (జిఏపి) అనే అంశంపై వివరించారు. దోమపోటును ఎలా గుర్తించాలి, ఎటువంటి యాజమాన్య పద్ధతులు పాటించాలి అనే విషయాలు వ్యవసాయ శాఖ అధికారి భార్గవి వివరించారు. ఇతర పురుగు తెగులు మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలు పరిశీలన



జలుమూరు అక్టోబర్ 18 (వార్త): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న బోధన పట్ల పరిశీలనకు సీఆర్ఎంటీలను ఎంఈఓలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం నరసన్నపేట మండలం రావాడపేట ప్రభుత్వ పాఠశాలలో టీచింగ్ టూల్ కార్యక్రమంలో భాగంగా పాఠ్యాం శాల బోధనలను సీఆర్ఎంటీ లక్ష్మణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఉపాధ్యాయుడు గొద్దు నరసింహులు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయిలో విద్యార్థులకు బోధనలు చేపడుతున్నామని తెలిపారు.

## జల దిగ్బంధంలో సూరాడ వీధి

### డ్రైనేజి సౌకర్యం కల్పించాలని సూరాడ వీధి ప్రజలు డిమాండ్



వజ్రపుకొత్తూరు అక్టోబర్ 18 (వార్త): ఇటీవల కురిసిన భారీ వర్షానికి హుకుంపేటలో సూరాడ వీధి జాల దిగ్బందానికి గురైంది. గత పదేళ్ల కాలంగా వీధి ప్రజలు డ్రైనేజి సౌకర్యం కల్పించాలని కోరుతున్నా పట్టించుకున్న నాథుడు లేక అవస్థలు పడుతున్నారు. ఊర్లో ఉన్న అన్ని వీధుల వర్షపు నీరు వీధులలోకి చేరి ఎటూ వెళ్లక నిల్వ వుండిపోవటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సూరాడ వేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించి డ్రైనేజి సౌకర్యం కల్పించాలని వీధి ప్రజలు కోరుతున్నారు.

## ఆక్రమణదారుణునిపై చర్యలు తీసుకోండి

### అధికారులకు సోంపేట వాసులు ఫిర్యాదు



సోంపేట, అక్టోబర్ 18 (వార్త): సోంపేట పట్టణం శ్రీశ్రీ ఆంజనేయ విగ్రహం ఎదురువీధికి చెందిన ఓ వ్యక్తి అక్కడున్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా దుకాణం పెట్టి సుమారు 80 అడుగులు స్థలాన్ని వెనుక వైపు ఆక్రమించడం వలన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని. ఆక్రమణదారునిపై తక్షణమే చర్యలు తీసుకొని ఈ ప్రాంతీయులకు న్యాయం చేయాలని ఆ వీధివాసులు శుక్రవారం అధికారులకు వెంకటరావు, ప్రసాద్ ఫిర్యాదు చేసారు. సోంపేట పంచాయతీ ఈవో, మండల తహశీల్దారులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బీన ఆనందరావు, ఎన్.వెంకటరావుతోపాటు వీధి వాసులు పాల్గొన్నారు.

## ఎకువూరులో తెలంగాణా బతుకమ్మ

సోంపేట, అక్టోబర్ 18 (వార్త): నందిన్న ఉత్సవాలు సోంపేట మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో బాగంగా ఎకువూరు మత్స్యకార గ్రామానికి చెందిన పలువురు మహిళలు తెలంగాణాలో ప్రఖ్యాతి గాంచిన బతుకమ్మ పండుగను మూడో రోజైన శుక్రవారం రాత్రి భక్తి శ్రద్ధలతో జరిపారు.పెళ్లి కాని యువతలు బాలగౌరమ్మ, వివాహం అయి పిల్లలు లేనివారు సంతానం కోసం నందమ్మ పూజలు చేయడం ఇక్కడ మహిళలకు ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు ఉప్పలాం పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యార్థిని ఆత్మహత్యపై సత్వర నివేదిక అందించండి

### ఏపి ఎస్సిపిసిఆర్ సభ్యులు సీతారాం



శ్రీకాకుళం, అక్టోబర్ 18 (వార్త): శ్రీకాకుళం జిల్లా పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలోగల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో గురువారం ఏడో తరగతి చదువుతున్న 12 ఏళ్ల విద్యార్థిని హాస్టల్ రూమ్‌లో తన జడరిబ్బన్‌తో ఆత్మహత్యకు పాల్పడ్డ ఉదంతంపై జిల్లా విద్యాశాఖాధికారులు, ఐ.టి.డి.ఏ అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి సత్వర నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసినట్టు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపి ఎస్సిపిసిఆర్)సభ్యులు గొండు సీతారాం తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ దసరా సెలవుల అనంతరం స్కూల్‌కి చేరుకున్న విద్యార్థిని మృతికి కుటుంబ సభ్యుల ఒత్తిడి గానీ ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా, ఉపాధ్యాయుల వేధింపులు ఏవైనా ఉన్నాయా,ఆత్మ హత్యకు పాల్పడిన అనంతరం తుది ప్రయత్నంగా స్కూల్ అధికారులు ఆసుపత్రికి తీసుకెళ్లడంలో ఆలస్యం ఏదైనా జరిగిందా, ఆసుపత్రి సిబ్బంది అందించిన వైద్య సేవలుపై పూర్తి వివరాలు అందించాలని సూచించారు,అధికారులు సమర్పించే నివేదిక ఆధారంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో కమిషన్ చర్యలకు ఉపక్రమించనున్నట్టు సీతారాం తెలిపారు.

# విభిన్న ప్రతిభావంతుల నుంచి 'స్వాభిమాన్' వినతుల స్వీకరణ

శ్రీకాకుళం, అక్టోబర్ 18 (వార్త):: దివ్యాంగులు ఎందులోనూ తీసిపోరని జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ప్రతీ నెల మూడవ శుక్రవారం స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 18న శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ మండలాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుండి జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడి కవితతో కలసి వినతులు స్వీకరించారు. స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమానికి 31 వినతులు వచ్చాయి. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రతీ నెల మూడవ శుక్రవారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ (స్వాభిమాన్) వినతుల స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, దివ్యాంగులు ఎందులోనూ తీసిపోరన్నారు. జిల్లా కలెక్టర్ తొలిత రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. సారవకోట మండలం, అలుదు గ్రామానికి చెందిన సిహెచ్ మోహనరావు తనకుమారుడు సిహెచ్ తేజా కుమార్ అంగవైకల్యం ఉన్నందున నెలకు 6 వేల రూపాయలు దివ్యాంగుల పింఛన్ అందుతుందని తన కుమారుడు 100శాతం దివ్యాంగుడు అయినందున నెలకు 15వేల రూపాయలు పింఛన్ మంజూరు చేయాలని, పోలాకి మండలం, రాళ్లపాడు పంచాయతీ ముప్పిడి గ్రామానికి చెందిన డి. ఆదిలక్ష్మి తనకు ఉపాధి



కల్పించవలసిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. బి.మీనాక్షి, రిమ్స్ సూపరిండెంట్ డా షకీలా, డి.సి.హెచ్.యస్ .డా. కళ్యాణబాబు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతి శ్రీ , డ్వామా పి.డి బి.సుధాకర్ రావు, డిపిఓ కె. భారతీసౌజన్య, జిల్లా పరిషత్ సిఈఓ శ్రీధర్ రాజు, జిల్లా ఉపాధి కల్పనాధికారిణి సుధా, గృహ నిర్మాణం సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.నగేష్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం. సూర్య కిరణ్, బి.సి కార్పొరేషన్ ఇ.డి గెడ్డెమ్మ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్, జిల్లా నలుమూలల నుంచి పలువురు దివ్యాంగులు, బధిరులు, బ్లైండ్ సంఘాల సభ్యులు తదితరులు హాజరయ్యారు.

# రైఫల్ షూటింగ్ పోటీలకు చేతన్, త్రిలోచన్‌లు ఎంపిక



శ్రీకాకుళం, అక్టోబర్ 18 (వార్త): రాజమండ్రిలో ఈనెల 19, 20 తేదీలలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు శ్రీకాకుళం జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో శ్రీకాకుళం న్యూ సెంట్రల్ స్కూల్ లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి శిష్టు లక్ష్మీ చేతన్, అండర్ 14 విభాగంలో నగరంలోని ఆక్స్ఫర్డ్ స్కూలుకు చెందిన 7వ తరగతి విద్యార్థి మల్లారెడ్డి త్రిలోచన్ వెంకట సాయి ప్రసాద్ లు, రాజమండ్రిలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో జరగనున్న పోటీలకు హాజరు కానున్నారు. చిత్తరంజన్ వీధిలోని, పిల్లల లక్ష్మణమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాతృదేవోభవ రైఫిల్ షూటింగ్ ఇన్స్టిట్యూట్ కి చెందిన విద్యార్థులిద్దరూ ఈ పోటీలకు ఎంపిక కావడం పట్ల శిక్షకుడు పిల్లల తిరుమల హరీష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో రైఫిల్, పిస్టల్ షూటింగ్ కు ఇప్పుడిప్పుడే ఆదరణ కనిపిస్తోందని ఆయన చెప్పారు. భారత రక్షణ రంగంలోని నేవీ, ఎయిర్ ఫోర్స్, కోస్ట్ గార్డు, ఇంకా అనేక ప్రభుత్వ ఉద్యోగాలలో షూటింగ్లో పతకాలు సాధించిన విద్యార్థులకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని ఆయన అన్నారు. జిల్లా నుంచి జాతీయస్థాయి వరకు గత పదేళ్లలో ఎంతోమంది వివిధ స్థాయి పోటీలకు వెళ్లారని హరీష్ కుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. రైఫిల్ పోటీలకు వెళ్ళనున్న చేతన్, త్రిలోచన్ లను ఎస్.జి.ఎఫ్ జిల్లా కార్యదర్శి బివి రమణ, న్యూ సెంటర్ స్కూల్ ప్రిన్సిపాల్ బలివాడ మల్లేశ్వరరావు, డైరెక్టర్ పి శ్రీకాంత్, ఆక్స్ఫర్డ్ స్కూల్ కరస్పాండెంట్ రమేష్ తదితరులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో రైఫిల్ షూటింగ్లో జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## నాణ్యమైన ఎరువులు, విత్తనాలివ్వండి

శ్రీకాకుళం, అక్టోబర్ 18 (వార్త): రబీ సీజన్ (2024-25) కు సంబంధించి రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డీలర్లకు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం ఆయన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలిసి జిల్లాలోని ఎరువులు, విత్తనాల హోల్‌సేల్ డీలర్లు, ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే పలువురు డీలర్లపై జరిమానాలు విధించినట్లు హెచ్చరించారు. నాణ్యమైన విత్తనాలను, ఎరువులను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఆయా కంపెనీదారులను ఆదేశించారు. రానున్న సీజన్లో 77,176 హెక్టార్లలో రబీకి సాధారణ సాగు విస్తీర్ణం అంచనా వేసినట్లు, ఇందుకుగాను 40,225 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉంటుందని గుర్తించామని, ప్రస్తుతం జిల్లాలో 9793 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అత్యధికంగా 29,930 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి త్రినాధ స్వామి, జిల్లా కోపరేటివ్ అధికారి బి. నగేష్, డిసిసిబి సీఈవో వర ప్రసాద్, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ రమణి, హోల్ సేల్ ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వైశ్యరాజు గోవిందరాజు, పొట్నూరు శ్రీరాములు, బోయిన గోపాల్, వ్యవసాయ శాఖ ఏడీలు, పలు ఎరువుల కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను ప్రభావిత మండలాలకు ప్రత్యేక అధికారులు

శ్రీకాకుళం, అక్టోబర్ 18 (వార్త): తుఫాను ముందస్తు చర్యలలో భాగంగా జిల్లాలోని 11 తీర ప్రాంత మండలాలకు ప్రత్యేక పర్యవేక్షక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అదేశాలు జారీ చేశారు. వీరంతా ఆయా తీర ప్రాంత మండలాలలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అప్రమత్తం చేశారు. తీర ప్రాంత మండలాలైన రణస్థలానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, పి.కిరణ్ కుమార్ (ఫోన్ :8008803800), ఎచ్చర్లకు డ్వామా పీడీ, బి.సుధాకర్ రావు (ఫోన్:8790008399), శ్రీకాకుళం మండలానికి జిల్లా పంచాయతీ అధికారి, కే.భారతి సౌజన్య (8341493877), గారకు ఐసిడిఎస్ పీడి, బి.శాంతి శ్రీ (9440814582), పొలాకికి జిల్లా పరిషత్ సీఈవో, శ్రీధర్ రాజు రామన్ (9100997770), సంతబొమ్మాళికి జిల్లా పరిశ్రమల శాఖ, జనరల్ మేనేజర్ ఉమామహేశ్వర రావు (9866530885), వజ్రపు కొత్తూరుకు మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్, పివి. శ్రీనివాసరావు (9440 716028), సోంపేటకు కార్మిక శాఖ సహాయ కమిషనర్, అజయ్ కార్తికేయ (9492555034), మందసకు పశుసంవర్ధక శాఖ పలాస సహాయ సంచాలకులు, పి చంద్రశేఖర్ (9492416700), కవిటికి ఉద్యాన శాఖాధికారి ఆర్వివి ప్రసాద్ (7995086758), ఇచ్ఛాపురం మండలానికి డ్వామా ఏపిడి సిహెచ్.శ్రీనివాస్ రెడ్డి (6309998070)లను తుఫాను పర్యవేక్షక అధికారులుగా నియమించారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## చెరువును తలపిస్తున్న హైస్కూల్ రోడ్డు

**వజ్రపుకొత్తూరు, అక్టోబర్ 18(వార్త) :** హుకుంపేట హైస్కూల్ రోడ్డు చెరువును తలపిస్తోంది. నిత్యం ఈ రూట్‌లో బస్‌లు, ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాలు తిరుగుతుంటాయి. వర్షపు నీటి నిల్వతో అన్ని వర్గాల వాహన చోదకులు, ప్రయాణికులు, ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందించి సుమారు వంద మీటర్ల వరకు సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# వసతి గృహాలను సందర్శించిన సివిల్ జడ్జి

**టెక్కలి, అక్టోబర్ 18(వార్త) :** టెక్కలిలోని ప్రభుత్వ, సాంఘిక సంక్షేమ కళాశాలల బాలుర వసతిగృహాలను శుక్రవారం టెక్కలి కోర్టు ఫుల్ అడిషనల్ చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాస రావు సందర్శించారు. వసతిగృహాల స్థితిగతులను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. విద్యార్థులకు తగు సదుపాయాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆయా వసతి గృహాల సిబ్బంది ఉన్నారు.



# ఎల్ఐసీలో క్లా బ్యాక్ క్లాజ్ రద్దు చేయాలి



**ఇచ్ఛాపురం, అక్టోబర్ 18(వార్త):** భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఇటీవల తీసుకొన్న కొన్ని నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆలిండియా ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ పిలుపు మేరకు శుక్రవారం ఇచ్ఛాపురం ఎల్ఐసీ శాటిలైట్ ఆఫీస్ వద్ద మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఏజెంట్లు నిరసన చేపట్టారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. పాలసీలపై బోనస్ పెంచాలని, జీఎస్ టీ రద్దు చేయాలని, కమిషన్ పెంచాలని, క్లా బ్యాక్ క్లాజ్ రద్దు చేయాలని, పాలసీలను పాత పద్ధతిలో కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మరాజు, శ్రీనివాసరాజు, బుజ్జి, తిరుపతిరావు, చిన్నారావు, ద్రోణ, రాధాకృష్ణ, భాస్కర్, ఆనంద్, దుర్యోధన, గిరిబాబు, దివాకర్, రామకృష్ణ, పంతులు, శ్రీను పాల్గొన్నారు.

**జలుమూరు:** ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీ విధించడంపై సిబ్బందితో పాటు ఏజెంట్లు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం నరసన్నపేటలోని ఎస్ఐసీ కార్యాలయం వద్ద యూనియన్ కార్యదర్శి ఉప్పాడ పూర్ణరావు మాట్లాడుతూ.. జీవిత బీమా వ్యవస్థలో ఇటువంటి ప్రక్రియ గతంలో ఎప్పుడూ లేదన్నారు. కార్యక్రమంలో ఏజెంట్లు పాల్గొన్నారు.



# ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు

**ఇచ్ఛాపురం, అక్టోబర్ 18(వార్త):** ఇచ్ఛాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం మొరింగాడే నిర్వహించారు. మునగచెట్టు మహిళల ఆరోగ్యానికి తొలి మెట్టు అని, తల్లులకు పోషణ ప్రాముఖ్యతను వివరించారు.

మునగాకు కరి వేపాకుతో వంటకాలు తయారు చేశారు. మహిళలలో రక్తహీనతను అరికట్టుటకు మునగాకు ఎంతగానో దోహదపడుతుందని, మునగాకు రోగ నిరోధక శక్తిని పెంచుతుందని, కొలెస్ట్రాల్ నియంత్రణ చేస్తుందని, చక్కెర వ్యాధి నియంత్రణ చేస్తుందని, విటమిన్ ఏ, విటమిన్ సీ, కాల్షియం, ఐరన్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా కలవని తెలిపారు. పోషకాహార పంపిణీ చేపట్టారు. సామూహిక మంతాలు, నిర్వహించారు.

కార్యక్రమంలో సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, తల్లులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.





## మరువాడలో జంగిల్ క్లియరెన్స్

**సంతబొమ్మాళి, అక్టోబర్ 18(వార్త) :** సంతబొమ్మాళి మండలం మరువాడ పంచాయతీలో సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి దాసురాజు ఆధ్వర్యంలో శనివారం జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఆర్.మరువాడ నుంచి ఎం.మరువాడ బస్టాప్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు, చెత్తాచెదారం జేసీబీతో తొలగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి రామిరెడ్డి, వార్డ్ మెంబర్ తిప్పాన వసంత రెడ్డి, సెక్రటరీ డిక్కల వాసు, జెఎల్ఎం హేమసుందర్, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాస్ యాప్‌పై అవగాహన



**జలుమూరు, అక్టోబర్ 18(వార్త):** జలుమూరు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ యాప్‌పై ఎంపీడీవో రామారావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. 15 సంవత్సరాలు దాటిన నిరక్షరాస్యులు ఈ యాప్‌లో తమ పేర్లను నమోదు చేసుకునేలా ఎంఈవోలు, ఏపీఎంలు కృషి చేయాలని కోరారు. వెలుగు సిబ్బందిని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు డ్రాయింగ్ మెటీరియల్



**జలుమూరు, అక్టోబర్ 18(వార్త):** కరకవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ మెటీరియల్ అందించామని హెచ్ఎం పంచాది ఈశ్వంరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురం గ్రామానికి చెందిన ఇంజినీర్ పంచిరెడ్డి రాంజీ ప్రతి ఏడాది విద్యార్థులకు వీటిని సమకూరుస్తారన్నారు. విద్యార్థులకు ఎస్ఎంసీ చైర్మన్ కరుకోల లక్ష్మి పంపిణీ చేశారు.

## పరిసరాల పరిశుభ్రత

**జలుమూరు, అక్టోబర్ 18(వార్త):** జలుమూరులోని పాఠశాల ఆవరణలో పారిశుధ్య పనులు శుక్రవారం చేపట్టామని హెచ్ఎం వేణుగోపాలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో పరిసరాలను శుభ్రం చేస్తున్నామని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. వీటి స్థానంలో విద్యార్థుల ఆహారానికి ఉపయోగపడే కూరగాయల మొక్కలను నాటుతామని తెలిపారు. సేంద్రియ ఎరువులతో పెంచి, వాటి ద్వారా వచ్చే కూరగాయలను ఉపయోగిస్తామన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక





# సీఎస్ డీటీగా రామారావు



**వంగర, అక్టోబర్ 18(వార్త) :** వంగర, రేగిడి మండలాల సీఎస్ డీటీగా పిన్నింటి రామారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో చీపురుపల్లి సీఎస్ డీటీగా పని చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఈ మండలాలకు నియమితులయ్యారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తానన్నారు. ఆయా మండలాల నాయకులు, అధికారులు, డీలర్స్ పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు.



## అపార్డ్ నమోదుపై దృష్టి సారించండి

**జలుమూరు, అక్టోబర్ 18(వార్త):** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అపార్డ్ నమోదు తప్పనిసరిగా చేయాలని ఎంఈవోలు బమ్మిడి మాధవరావు, ఎం.ప్రసాద రావు తెలిపారు. శుక్రవారం వారు జలుమూరు ఎంఆర్సీ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్క విద్యార్థి ఆధార్ కార్డు, స్కూల్లో చేరిన వివరాలు అన్ని సేకరించి నమోదు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## మందస వైస్ ఎంపీపీకి మాతృ వియోగం



శాంతమ్మ(ఫైల్)

**మందస, అక్టోబర్ 18(వార్త) :** మందస వైస్ ఎంపీపీ సీర ప్రసాద్‌కు మాతృ వియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి సీర శాంతమ్మ శుక్రవారం మర ణించారు. శాంతమ్మకు నలుగురు కుమారులతో పాటు ఇద్దరు కుమార్తెలున్నారు. అల్లుడు వడిశ బాలకృష్ణ ప్రముఖ న్యాయవాది. ప్రసాద్ కుటుంబాన్ని పలువురు పరామర్శించి, శాంతమ్మ మృతికి సంతాపం తెలిపారు.

## సిద్ధాశ్రమంలో శ్రీశక్తి హెూమం



**జలుమూరు, అక్టోబర్ 18(వార్త):** నరసన్నపేటలోని ఇందిరానగర్ వద్ద ఉన్న సిద్ధాశ్రమంలో శ్రీశక్తి హెూమాది కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా సిద్ధాశ్రమ అధ్యక్షుడు శిమ్మ జగన్నాథం మాట్లాడుతూ.. ప్రతి పౌర్ణమిన ఈ కార్యక్రమాలు నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

**జలుమూరు, అక్టోబర్ 18(వార్త):** రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం అమలు చేయాలని ఎంఈవో బమ్మిడి మాధవరావు తెలిపారు. శుక్రవారం ఆయన గుండువలస ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.



# డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

**టెక్కలి, అక్టోబర్ 18(వార్త) :** రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు టెక్కలిలోని కోర్టుల సముదాయంలో డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని టెక్కలి కోర్టు ఫుల్ అడిషనల్ చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు. రాజీయే రాజమార్గమని, రాజీకి వీలైనన్ని ఎక్కువ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని, లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని తెలిపారు. ఈ అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు




కూడా వాపసు ఇస్తామన్నారు. ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు సహకరించాలని కోరారు. సమావేశంలో టెక్కలి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు డీవీ వివేకానంద, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ పంపిణీలో ఫిర్యాదులొస్తే చర్యలు



**సోంపేట, అక్టోబర్ 18(వార్త):** రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సమన్వయంతో కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలని సోంపేట తహసీల్దార్ బి.అప్పలస్వామి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, రెవెన్యూ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది ఎండీయూల పనితీరుపై వినియోగదారుల నుంచి ఆరోపణలు వస్తున్నాయని, అన్ని వర్గాల వారు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని సూచించారు. ప్రతి నెలా ఒకటో తేదీన తప్పనిసరిగా రేషన్ పంపిణీ ప్రారంభించాలని, ఇందుకు డీలర్లు ఈపాస్ మిషన్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. నవంబర్ నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కార్డుదారులకు కిలోచొప్పున కందిపప్పు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పనిచేయాలని సూచించారు. రేషన్ పంపిణీలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని, అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకంలో సరుకుల పంపిణీలో వేలిముద్రల సమస్య తీవ్రంగా ఉందని, రేషన్ డీలర్లు వేలిముద్రలతో సరుకుల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని డీలర్లు, ఎండీయూలు కోరారు. సమావేశంలో డీటీ మహేష్, సీఎస్ డీటీ కూర్మారావు, డీలర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

# కనీస వేతనాలు అమలుచేయండి

**కొత్తూరు, అక్టోబర్ 18 (వార్త):** కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని కోరుతూ శుక్రవారం వారు కొత్తూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్‌కి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ కొత్తూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో కొన్నేళ్లుగా వివిధ విభాగాలలో శానిటేషన్ సిబ్బంది ఎనిమిది మంది పనిచేస్తున్నారన్నారు. చట్ట ప్రకారం వీరికి కనీస వేతనం నెలకు రూ.16 వేలు చెల్లించాల్సి ఉందన్నారు. వారాంతపు సెలవులు అమలు చేయకపోగా క్యాజువల్, జాతీయ పర్వదినాల సెలవులు కూడా కనీసం అమలు చేయడం లేదని వాపోయారు. ప్రస్తుతం వీరికి నెలకు రూ.10,075 రూపాయలు మాత్రమే వేతనం చెల్లిస్తున్నారని, నెలకు మూడు సెలవులు మాత్రమే అమలు చేస్తున్నారని తెలిపారు. వీరికి ఇప్పటివరకు ఈఎస్ఐ కార్డులు మంజూరు చేయలేదన్నారు. పీఎఫ్ వాటాలో కాంట్రాక్టర్ చెల్లించాల్సినది కూడా కార్మికుల వేతనాల నుంచే మినహాయిస్తున్నారని ఆరోపించారు. యూనిఫామ్స్, షూలు, మాస్కులు కూడా ఇవ్వకపోవడంతో చాలా కష్టంగా ఉందని వాపోయారు. ఎటువంటి కార్మిక చట్టాలు అమలు చేయకుండా. కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ వారిపై పని భారం విపరీతంగా పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సంఖ్యను వెంటనే పెంచాలని కోరారు. తక్షణమే వీరికి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నేతలు విజయ కుమారి, లక్ష్మి, మాలతి, వెంకటేష్, భవానీ పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## జిల్లేడువలస పాఠశాలను సందర్శించిన ఎంఈవో-2

**జలుమూరు, అక్టోబర్ 18(వార్త):** పోలాకి మండలం జిల్లేడువలస గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి-2 లింగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకొని ఉపాధ్యాయులకు విద్యార్థులకు తగు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రగతి కోసమే పల్లె పండుగ

**సోంపేట, అక్టోబర్ 18(వార్త):** పల్లెల్లో అభివృద్ధిని కాంక్షిస్తూ గ్రామీణ ప్రాంతాల ప్రగతి కోసం పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, సోంపేట జడ్పీటీసీ మాజీ సభ్యుడు సూరాడ చంద్ర మోహన్ అన్నారు. శుక్రవారం ఆయన తాళ్లభద్రలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 20 వరకు ఈ వారోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. గ్రామీణ కుటుంబాలకు ఏడాదిలో కనీసం 100 రోజులు వేతనంతో ఉపాధి, మెరుగైన జీవనోపాధి కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘ నిధులను విడుదల చేసిందని తెలిపారు. గత వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు గ్రామీణ ప్రాంతాలు కనీస మౌలిక సదుపాయాలుకు నోచుకోక అధ్వాన పరిస్థితికి చేరుకున్నాయన్నారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్తు, రహదారులు వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా నోచుకోకపోవడంతో ప్రజలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొన్నారన్నారు. పల్లెలకు పూర్వ వైభవం తెచ్చేందుకే పల్లె పండుగ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గానికి సంబంధించి రూ.32 కోట్లతో రోడ్లు, కాలువలు, ఇతర పనులు చేపట్టనున్నట్టు వివరించారు. ఆగస్టు 23న నిర్వహించిన గ్రామసభల్లో గుర్తించిన పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రైతులకు ఉపయోగపడేలా అభివృద్ధి పనుల్ని చేపట్టనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో సోంపేట ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బిన్నళ జగన్నాథం, ఉగ్రపల్లి మాధవరావు, బూరగాన మాధవరావు, కృష్ణారావు, శివస్వామి, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



**ఇచ్ఛాపురం, అక్టోబర్ 18(వార్త):** పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా హరిపురం గ్రామంలో రూ.24లక్షలతో ఆరు పనులు, పాయితరి గ్రామంలో రూ.21 లక్షలతో ఆరు పనులు, కీర్తిపురం గ్రామంలో రూ.23 లక్షలతో ఐదు పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆ పనులకు శంకుస్థాపన చేశారు.

కార్యక్రమాల్లో జన సేన పార్టీ నాయకులు దాసరి రాజు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధన రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీ నర్ బుద్దాల నిర్మలారెడ్డి, దక్కత ఢిల్లీ రావు, సహదేవ్ రెడ్డి, కామేశ్వరరావు, కూటమి నాయకులు దుర్గాసి నీలవేణి, దక్కత రామారావు, కుమారస్వామి, రోకళ్ల భాస్కర్, నవీన్, సోమేశ్, రంగా, సంతోష్, బాలరాజు, జోగారావు, గోపి, చోట్, దుర్యోధన, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





**కొత్తూరు, అక్టోబర్ 18 (వార్త):** పల్లె పండుగ వారోత్సవాలను కొత్తూరు మండలంలోని పొంటూరు, కుద్దిగాం, మాకవరం తదితర గ్రామాల్లో శుక్ర వారం వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ నియోజకవర్గంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, నీటి సంరక్షణ ట్రెంచులు, గోకులాలను పెద్దఎత్తున అన్నిగ్రామాల్లో నిర్మిస్తామన్నారు. ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు. కార్యక్ర మంలో ఎంపీడీవో వి.నీరజ, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



**వంగర, అక్టోబర్ 18(వార్త) :** పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వంగర మండలంలోని వీవీఆర్ పేట, శివ్వాం, రుషింగి, మగ్గూరు తదితర గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.

మెట్ట మగ్గూరు గ్రామంలో గ్రామంలో సర్పంచ్ పోలిటెడ్డి రమేష్ టెంకాయ కొట్టి భూమిపూజ చేపట్టారు. రుషింగి, శివ్వాం, వీవీఆర్ పేట గ్రామాల్లో కూటమి నాయకులు కొబ్బరికాయలు కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో ఎల్.త్రినాథ రావు, ఈవో పీఆర్‌డీ కెల్ల రామారావు, పంచాయతీ, ఉపాధి హామీ సిబ్బంది, ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413